# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

## మీకొక సదవకాశము !

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 20 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం !!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 10 | మే 1990 | సంచిక 10


## సంపాదకీయము

### సువార్త ఎందుకు బోధింపబడాలి ?

### ( Why Preach the Gospel ? )

క్రీస్తు సువార్త ప్రకటింపబడాలి. నేటి మానవునికి అది అత్యవసరం. సువార్తను గంభీరంగా ప్రకటించి చక్కటి ఫలితాలు పొందాలంటే, మనం విశ్వాసంతో ప్రకటించాలి. దాన్ని సంపూర్తిగా నమ్మాలి. ఈ దిగువ సంగతులు సత్యమని అంగీకరించాలి :

1. క్రీస్తు లేకుండా యెవడు రక్షింపబడలేడు. నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాలేడని యేసు చెప్పాడు (యోహా 14:6). ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి యే నామమున మనము రక్షింపబడలేము (అపొ. కా. 4:12). సువార్త అందరికీ కావాలి. అది బోధింపబడందే యెవడు వినలేడు. ఈ లోకం ఉన్నస్థితిలో అంతా బావుంటే దానికి సువార్త అక్కర్లేదు. అయితే లోకంలో లేనిది మనదగ్గర వున్నది ప్రశస్తమైనదని మనం నమ్మకపోతే ఆత్మలను రక్షించే సువార్తను ప్రకటించలేము.

2. మానవుని రక్షించుటకు సువార్త దేవుని శక్తి. "సిలువను గూర్చిన వార్త నశించుచున్నవారికి వెర్రితనముగాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి" (1 కొరింథీ 1:18) "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి... రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" (రోమా 1:16). తన కుమారుని బలి యిచ్చుటద్వారా నిరూపింపబడిన దేవుని ప్రేమయే మనలను ఆకర్షించునట్టి శక్తి (యోహాను 12:32-33). అందువలన మనము ప్రేమించుచున్నాము (1 యోహా 4:19). సువార్త త్రాగుబోతును, జూదరిని, వ్యభిచారిని బాగుచేయగలదు, పాపిని శుద్ధిచేయగలదు. స్వార్థపరుడైన లోభిని సైతము అది దాతృత్వముగల వానిగ చేయును. దేవుని కుమారుని మాటలైన సువార్త మరణములోనుండి జీవానికి, తీర్పునుండి నిత్య జీవానికి నడిపిస్తుంది (యోహా 5:24, 25).

3. మానవుని రక్షించడానికి దేవుడుపయోగించే ప్రాముఖ్య పరికరము సువార్త. అది మంటిఘటములలో యుంచబడింది (2 కొరింథీ 4 : 5). మీరు వెళ్లి అందరికీ సువార్త ప్రకటించండి, నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని యేసుక్రీస్తు చెప్పాడు (మార్కు 16:15). "దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవునిని ఎరుగకుండినందున సువార్త ప్రకటన యను వెర్రితనము చేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్ప మాయెను" (1 కొరి 1 : 21). నీవు ఏ ప్రసార సాధనము వినియోగించినా, సువార్తమాత్రం ప్రకటించబడాలి.

4. సువార్త బోధింపబడితే గొప్ప సంగతులు సంభవిస్తాయి. అపొ. పేతురు బోధిస్తే మూడు వేలమంది హృదయాలు, జీవితాలు ఒక్క రోజులోనే మారిపోయాయి (అపొ. కా. 2). ఫిలిప్పు బోధిస్తే

ఒక ఆర్థిక మంత్రి సైతం మార్పు నొందాడు, సంతోషంతో తన త్రోవను వెళ్ళిపోయాడు. పౌలు ఏథెన్సులో ప్రకటిస్తే కొందరు హేళన చేసారు, ఎదురాడారు, గాని మరి కొందరు విశ్వాసులయ్యారు (అపొ. కా. 17:32-34).

అయితే నిస్సారమైన మానవకల్పిత బోధలు ఆచారాలు వలన దేవాలయాలు ఖాళీ అయిపోతున్నాయి. క్రీస్తు సువార్తను దురద చెవులుగల వారికి అనుకూలంగా బోధించేవారు ఖండించరు, గద్దించరు, బుద్ధి చెప్పరు. అట్టి బోధ ఎవరినీ రక్షించదు, బోధించేవాడు రక్షింపబడడు.

క్రీస్తునే కేంద్రీకృతం జేసుకొని దేవుని సంకల్పాన్నంతటినీ బోధించు (అపొ. కా. 20:27; 1 కొరింథీ 2:2). దేవుని వాక్యాన్ని జీర్ణించుకో, దాన్ని జీవించు. నీవెవరికి బోధించుచున్నావో వారిని ప్రేమించు. వారి సమస్యలకు అవసరాలకు దాన్ని ప్రేమతో సూచించు. అట్టి బోధ సహజంగా ప్రజలను ఆకర్షిస్తాది. దేవుని ఎల్లప్పుడు మహిమపరుస్తాది.

---

## వెయ్యేండ్ల పరిపాలననుగూర్చి నీవు ఆలోచించావా?

## (Have you wondered about the Thousand-year Reign)

ఈ వ్యాసమును చదువువారనేకులు "ప్రిమిల్లెనియలిజమ్" అను పదమును బహుశ విని యుండకపోవచ్చును. అయితే ఆ పదమునకు సంబంధించిన బోధ (వెయ్యేండ్ల పరిపాలన) ను గూర్చి విని యుండవచ్చును. నిజానికి ప్రొటెస్టాంటు మతశాఖలోని బోధకులందరు వెయ్యేండ్ల పరిపాలననుగూర్చి తప్పక బోధింతురు. ఈ వ్యాసములో ఆ బోధయొక్క నిర్వచనమును దానిని ఖండించుచున్న బైబిలు లేఖనములను గూర్చి చూడగలము.

## వెయ్యేండ్ల పాలన-సిద్ధాంతము

ఈ బోధ యేసుక్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చియు ప్రత్యేకముగా ఈ భూమిమీద ఆయన స్థాపింపబోవు రాజ్యమునకు సంబంధించినదై యుండును. "ప్రిమిల్లెనియలిజమ్" అను పదములో గల అర్థమును గమనించుము. "ప్రి" అనగా "ముందు" "మిల్లెనియల్" అనగా "వేయి సంవత్సరములు" "యిజమ్" అనునది "సిద్ధాంతము" లేదా "బోధను" సూచించుచున్నది. ఈ గ్రహముపై రాజ్యమును స్థాపించుటకు మునుపు క్రీస్తు ఈ భూమిమీదికి వచ్చును అని ఈ సిద్ధాంతము బోధించుచున్నది. ఈ సిద్ధాంతమును గూర్చి బోధించు వారు ప్రభువు ఈ లోకమునకు వచ్చి రాజ్యమును స్థాపించి పరిశుద్ధులందరితో కూడ వేయి సంవత్సరములు ఆనందకరమైన పరిపాలన చేయునని నొక్కి చెప్పుదురు. ప్రభువు ఒకానొక దినమున ప్రత్యక్షమగునని, ఆయనకు రాజ్యము కలదని, పరిశుద్ధులు ఆయన రాజ్యపు పౌరులని బైబిలు స్పష్టముగా బోధించు సత్యములను ఆధారము చేసికొని వెయ్యేండ్ల పరిపాలనా వాదులు యొక క్రొత్త సిద్ధాంతమును తయారుచేసి బోధించుచున్నారు. ఇది ఆశ్చర్యము కాదు. ఏలయనగా దేవుని వాక్యము వంచనతో బోధించుట సాతాను కుయుక్తులలో ఒకటి యని చెప్పవచ్చును (2 కొరింధి 4:2).

### బైబిలునందు గల అనేక లేఖనములలో రాజ్యమును గూర్చి పేర్కొనబడినది

రాజులను గూర్చి రాజ్యములను గూర్చి ఇశ్రాయేలు జనాంగమునకు తెలియును. పాత నిబంధన గ్రంథములోని చివర భాగములోగల ప్రవక్తలందరు రాబోవుచున్న రక్షకుడు, ఆయన రాజ్య స్థాపన, పరిపాలనను గూర్చి పేర్కొనిరి. యెషయా ఆయన రాజ్యపరి

పాలనను గూర్చి పేర్కొనుచు ఆ రాజ్యములో సమాధాన ముండు నని చెప్పెను (యెషయా 9 : 6).

క్రొత్తనిబంధన ఆరంభములోనే బాప్తిస్మ మిచ్చు యోహాను "దేవుని రాజ్యము సమీపించినది" అని ప్రకటించెను (మత్తయి 3:2). యేసుక్రీస్తు గూడ అదే వర్తమానమును ప్రకటించెను (మార్కు 1 : 15). "యూదులరాజు" అని యేసు పిలువబడి (మత్త 2 : 2) అదే సంగతిని ఆయన ఫిలిప్పు నొద్ద ఒప్పుకొనెను (యోహాను 18 : 37). అంతకు ముందే ఆయన తన రాజ్యము ఈలోక సంబంధమైనది కాదని, అది ఆత్మీయమైనదని చెప్పెను (18:36). యేసుక్రీస్తు రాకడ, వెయ్యేండ్ల పరిపాలన, రాజ్యస్థాపన, పరిశుద్ధుల పాలన మున్నగు వ్యాఖ్యలన్నిటికిని ఆ సంగతి ప్రాముఖ్యమైనది.

## రాజ్యమును గుర్తించుట

రాజ్యము సమీపముగా నున్నదని యేసుక్రీస్తు, యోహాను బోధించినట్లు గమనించితిమి. దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మీలో కొందరు మరణము రుచిచూడరని యేసు తనతో నున్నవారితో చెప్పెను (మార్కు 9 : 1). అనగా ఏదో యొక రూపములో దేవుని రాజ్యము వారి కాలములోనే వచ్చునని ఈవాక్య భావము. మత్తయి 16 : 18, 19లో "సంఘము" 'రాజ్యము' అను పదములు ఒకదాని కొకటి ప్రత్యామ్నాయ పదములుగా ఉపయోగించినట్లు చూడగలము. తన సంఘమును కట్టుదునని మరియు తాళపు చెవులు పేతురుకు యివ్వబడునని యేసు చెప్పెను. సువార్తలలో పేర్కొనినట్లుగా మనము పేతురును అనుసరించినచో అపొస్తలుల కార్యములు 2 అధ్యాయములో పునరుత్థానుడైన యేసును గూర్చి అతడు బోధించుట, సువార్తకు లోబడినవారు రక్షింపబడి సంఘమునకు చేర్చబడుట చూడగలము (అ. కా. 2 : 47).

రాజ్యము రాకడలో యున్న "బలము" అను మాటను కూడ మనము అనుసరింతుము. ప్రభువు కాలములో గల కొందరిని దృష్టిలో నుంచుకొని ఆయన ఈ మాటలు చెప్పెను. ప్రభువు పరలోకమునకు వెళ్ళక మునుపు పైనుండి శక్తి పొందువరకు వారు (అపొస్తలులు) పట్టణములోనే నిలచి యుండవలెనని చెప్పబడిరి (లూకా 24 : 49). ఆ "శక్తి"నే లూకా తన గ్రంథములో వాగ్దానము చేయబడిన పరిశుద్ధాత్మ బాప్తిస్మమని గుర్తు చేయుచున్నాడు (అ.కా. 1:4, 5, 8). ఇందువలన అపొస్తలులు భూమి యందంతట ప్రభువుకు సాక్షులుగా నుందురు. పెంతెకోస్తు దినమున శక్తి వచ్చెనని మనము గ్రహింతము (అ.కా. 2:1-4). ఆ సందర్భములో స్థాపించబడిన సంస్థ 'సంఘమని' తెలియుచున్నది. (2 : 47). రాజ్యము బలము లేక శక్తితో రావలసి యున్నది. ఆ వర్తమానములో గల 'బలము లేదా శక్తి' వలననే సంఘము స్థాపింపబడుట జరిగినది.

'శరీర మొక్కటే' అని పౌలు చెప్పుట ద్వారా ఈ సత్యము పునరుద్ఘాటింపబడినది (ఎఫెసి 4 : 4). శరీర మనగా సంఘమని అతడే చెప్పెను (ఎఫెసి 1 : 22, 23). కొలస్స క్రైస్తవులు, పౌలు కూడ రాజ్యములో సభ్యులుగా నున్నారని కొలస్స 1 : 13 లో గలదు. యోహానును ప్రకటన గ్రంథమును పొందిన వారు కూడ అట్లే యుండిరి (ప్రకటన 1 : 9). యోహానుతో బాటు ఏడు సంఘములలో గల సభ్యులందరు రాజ్యములో నున్నారని గ్రహించవలెను (ప్రకటన 2, 3 అధ్యా). నిజానికి శరీర మొక్కటే, అది సంఘమైయున్నది. యేసు కట్టుదునని 2,000 సం॥ల క్రితము వాగ్దానము చేసిన సంఘమే రాజ్యమైయున్నది (అ. కా. 2 అ. ). కావున వెయ్యేండ్ల పరిపాల నావాదులు బోధించుచున్నట్లుగా అది భవిష్యత్తులో స్థాపింపబడదు. రాజ్యము అనగా సంఘమని గుర్తింపబడినది. అట్లే సంఘము అనగా ప్రభువు యొక్క శరీరమని కూడ వ్రాయబడినది (కొలస 1 : 18,

ఎఫెసి 1 : 22, 23). అది ఒక ఆత్మీయ సంస్థయైయున్నది. గనుక రాజ్యమును గూర్చిన వాగ్దానములు భవిష్యత్తులో భూమిపై నెరవేరునని మానవులు ఎదురు చూచుటలో అర్థములేదు.

## వెయ్యేండ్ల పరిపాలనలో గల అంశములను గూర్చి ఈ దిగువ వివరించబడినవి

1) పాతనిబంధనలో నెరవేర్చబడని ప్రవచనములను గూర్చి, యేసు యిట్లనెను, "ధర్మశాస్త్రము నైనను ప్రవక్తల వచనముల నైనను కొట్టివేయ వచ్చితినని తలంచవద్దు, నెరవేర్చుటకేగాని కొట్టివేయుటకు నేను రాలేదు" (మత్తయి 5:17). తనను గూర్చి, రాజ్యమును గూర్చి, సంఘమును గూర్చిన పాతనిబంధన ప్రవచనము లన్నిటిని యేసుక్రీస్తు నెరవేర్చినాడు. ఈ నెరవేర్పు నంతటిని మనము పూర్తిగా చూడ నప్పటికిని ఈ సంగతులన్నియు నెరవేర్చబడినవి. భూసంబంధమైన నెరవేర్పుకొరకు వెయ్యేండ్ల పరిపాలనా వాదులు ఎదురు చూచుటలోనే వారి పొరబాటు గలదని మనము గ్రహించ గలము.

2) క్రొత్త ఆకాశము, క్రొత్త భూమి: వెయ్యేండ్ల పరిపాలనా వాదులు 2 పేతురు 3 : 13 ను ఆధారము చేసికొని క్రొత్త భూగ్రహము కొరకు ఎదురు చూచెదరు. ఈ భాగములో గల భూమి అను పదమునకుగల గ్రీకు పదము కేవలము ఈ భూమి అను గ్రహమును మాత్రమే సూచించుటకు ఉపయోగింపబడినది. అయితే తన వారందరు తండ్రి నివాసములో తనతోకూడ యుందురని ప్రభువు వాగ్దానము చేసెను (యోహాను 14 : 2,3). ఆ మీదట సజీవులమై నిలచియుండు మనము ప్రభువుతో ఎల్లప్పుడు జీవించుటకు మేఘముల మీద కొనిపోబడుదుమని పౌలు చెప్పుచున్నాడు (1 థెస్స 4 : 17). మన

స్వాస్థ్యము పరలోకమందున్నదని పేతురు వ్రాసెను (I పేతురు 1:4). ఈ భూమియు దానిలోని కృత్యములన్నియు కాలిపోవును (II పేతురు 3 : 10, 11). గనుక ప్రభువును నీతిమంతులును ఈ భూమిపై ప్రత్యక్షము కారని మనకు స్పష్టమగుచున్నది.

3) వెయ్యేండ్ల పరిపాలనా వాదులకు ప్రీతిగల లేఖన భాగము ప్రకటన 20వ అధ్యా. అయినప్పటికి వారి సిద్ధాంతమునకు అనువగు అంశము లిందులేవు. వారు ఉదాహరణగా తీసుకొను ఈ లేఖన భాగము "వారు వేయి సంవత్సరములు క్రీస్తుతో కూడ రాజ్యము చేసిరి," అని గలదు (ప్రకటన 20 : 4). వారికి అవసరమగు సిద్ధాంతము కొరకు వీరు ఈ భాగమును అపార్ధము చేసికొందురు. ఇక్కడ నీతిమంతు లందరిని యోహాను చూడలేదుగాని హతసాక్షు లైనవారి ఆత్మలను మాత్రమే చూచెనని వ్రాయబడినది. అదే వచనములో అతడు యింకను యిట్లు చెప్పుచున్నాడు. వారు క్రీస్తుతో కూడ బ్రతికినవారై వేయి సంవత్సరములు రాజ్యము చేసిరి. ఈ క్రైస్తవ యుగములో హతసాక్షులైనవారు క్రీస్తుతో కూడ పరిపాలించు ఘనతను పొందియున్నారు. అదే విధముగా ఈ యుగములో శ్రమపడుచున్న మన ప్రయాస కూడ వ్యర్ధము కాదను ఆదరణ ప్రోత్సాహము మనకును నిలచియున్నది. హతసాక్షు లైనవారు ప్రభువుతో నున్నట్లు యోహాను చూచెనను ఆధారమును బట్టి ఒకానొక దినమున మనము కూడ ప్రభువుతో నుందుమను సంతోషకరమైన నిరీక్షణ మనకును యున్నది. ఈ భూమి మీద జరుగు పరిపాలనను సూచించు అంశమేదియును యిందు పేర్కొనబడలేదు. వారు క్రీస్తుతో కూడనుండిరి.

## వెయ్యేండ్ల పాలన బోధ సంఘమును అపార్థము చేసికొనుచున్నది

మానవులు నిజమైన రాజ్యముకొరకు ఎదురు చూచుచుండగా

దేవుని రాజ్యమునకు బదులు సంఘమును చేకొరక ప్రత్యామ్నాయ సంస్థను అప్పటి కప్పుడు ఏర్పాటు చేసినను సిద్ధాంతమును వెయ్యేండ్ల పరిపాలనా వాదులు బోధించుచున్నారు. అయితే పౌలు యిట్లు చెప్పుచున్నాడు. "దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన నిత్య సంకల్పము చొప్పున సంఘముద్వారా తనయొక్క నానావిధమైన జ్ఞానము యిప్పుడు తెలియబడవలెనని ఉద్దేశించెను" (ఎఫెసి 3:10, 11). ఒకడు డై బిలుగాని లేదా ప్రిమిల్లేనియలిజమ్ సిద్ధాంతమును గాని నమ్మవలెను. అయితే రెండింటిని నమ్ముట మంచిది కాదు.

వెయ్యేండ్ల పరిపాలనా సిద్ధాంతము రాజరికమును ప్రభువు నుండి తొలగించుచున్నది. ఆ సిద్ధాంతము ప్రకారము ఆయన నేడు రాజుగా లేడు. ఏలయనగా ఆయన రాజ్యము యింకను స్థాపింపబడి యుండలేదు. నేడు ప్రభువు పరిపాలన చేయుచున్నాడను స్పష్టమైన క్రొత్త నిబంధన బోధను ఈ సిద్ధాంతము వ్యతిరేకించుచున్నది. అపొస్తలులు అంతమును గూర్చి వ్రాయుచు పిమ్మట ఆయన తన తండ్రియైన దేవునికి రాజ్యమును అప్పగించును (1 కొరింథీ 15:24) అని చెప్పిరి. రాజ్యస్థాపన కాదుగాని రాజ్యమును అప్పగించుట జరుగును. కావున ఆయన రాకడకు మునుపే రాజ్యంనిలచి యుండును. ఇంకను పౌలు యిట్లు వ్రాయుచున్నాడు తన శత్రువు లందరిని తన పాదముల క్రింద ఉంచువరకు ఆయన పరిపాలన చేయును. కడపట నశింపజేయబడు శత్రువు మరణము. మరణము లేనంతవరకు ఆయన పరిపాలన చేయునని గ్రహించుము. అనగా మరణము నిలచి యున్నంత వరకు ఆయన పరిపాలన చేయుచుండవలెను. ప్రభువు పరిపాలన చేయుచున్నాడనుటకు రుజువుగా ప్రతి దినము మానవులు చనిపోవుచున్నారు. క్షయమైనవారు యింకను ప్రతి దినము శ్మశానమునకు ప్రయాణము చేయుచున్నారు.

స్నేహితులారా, ఈ అంశములను జాగ్రత్తగా చదవండి. రాజును గూర్చి రాజ్యమును గూర్చి పాతనిబంధన పేర్కొనగా యేసు క్రీస్తు తన రక్తముతో కొనిన సంఘంలో ఆ సంగతులన్నియు నెర వేరినట్లు క్రొత్త నిబంధన తెల్పుచున్నది. సువార్తకు లోబడినవారు ప్రభువుచే సంఘమునకు చేర్చబడుదురు (అ.కా. 2 : 47). ఇంకొక మాటలో చెప్పవలెననిన, వారు రాజ్య పౌరులుగా చేయబడు చున్నారని భావము. ఈగ్రహాముపై ఈ లోకసంబంధమగు రాజ్యము కొరకు మానవులు ఎదురు చూచుట వ్యర్థము. ప్రభువు ప్రత్యక్షమగు నపుడు ఆయన రాజ్య స్థాపనకు కాక, రాజ్యమును తండ్రికి అప్పగించు టకు మాత్రమే వచ్చును. ఆ రాజ్యములో నీవు లేకుండుట ఎంత విచారకరము! సువార్తకు లోబడి మరణము వరకు నమ్మకముగా జీవించుటద్వారా నీవు సరియైన నిశ్చయమును చేయగలవు.

— W. N. జేక్సన్

---

## నేనెవడనని ప్రజలు చెప్పుకొనుచున్నారు ?

### (Whom say people that I am?)

"ఒకప్పుడాయన ఒంటరిగా ప్రార్థన చేయుచుండగా ఆయన శిష్యులు ఆయన యొద్ద ఉండిరి - నేనెవడనని జనసమూహములు చెప్పుకొనుచున్నారని ఆయన వారి నడుగగా, వారు బాప్తిస్మమిచ్చు యోహాననియు, కొందరు - ఏలీయా యనియు, కొందరు - పూర్వ కాలపు ప్రవక్త యొకడు లేచెననియు చెప్పుకొనుచున్నారనిరి. అందు కాయన - మీరైతే నేనెవడనని చెప్పుకొనుచున్నారని వారి నడు గగా పేతురు - నీవు దేవుని క్రీస్తువనెను" (లూకా 9:18-20).

1. దేవుడు :- "అందువలన - ఆయనే మన బలహీనతలను వహించుకొని మన రోగములను భరించెనని ప్రవక్తయైన యెషయా

ద్వారా చెప్పబడినది నెరవేరెను" (మత్తయి 8 : 17). "అతడు ఇంకను మాటలాడుచుండగా ఇదిగో ప్రకాశమానమైన యొక మేఘము వారిని కమ్ముకొనెను. ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను. ఈయన మాట వినుడని యొక శబ్దము ఆ మేఘములోనుండి పుట్టెను" (మత్తయి 17 : 5).

"మరియు - నీవు నా ప్రియ కుమారుడవు, నీయందు నేనానందించుచున్నానని యొక్క శబ్దము ఆకాశమునుండి వచ్చెను" (మార్కు 1 : 11).

"మేఘమొకటి వచ్చి వారిని కమ్మగా - ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన మాట వినుడని యొక శబ్దము ఆ మేఘములో నుండి పుట్టెను" (మార్కు 9 : 7).

"పరిశుద్ధాత్మ శరీరాకారముతో పావురమువలె ఆయన మీదికి దిగివచ్చెను. అప్పుడు - నీవు నా ప్రియకుమారుడవు, నీయందు నేనానందించుచున్నానని యొక శబ్దము ఆకాశమునుండి వచ్చెను" (లూకా 3 : 22).

"మరియు - ఈయన నేనేర్పరచుకొనిన నా కుమారుడు, ఈయన మాట వినుడని యొక శబ్ధము ఆ మేఘములోనుండి పుట్టెను" (లూకా 9 : 35).

"ఆయన మహాత్మ్యమును మేము కన్నులార చూచినవారమై తెలిపితిమి. ఈయన నా ప్రియకుమారుడు ఈయనయందు నేను ఆనందించుచున్నాను అను శబ్దము మహా దివ్యమహిమనుండి ఆయన యొద్దకు వచ్చినప్పుడు, తండ్రియైన దేవుని వలన ఘనతయు మహిమయు ఆయన పొందగా... (II పేతురు 1 : 17).

2. యేసు :- "అప్పుడాయన - మీరు క్రిందివారు, నేను పై నుండువాడను, మీరు ఈలోక సంబంధులు, నేను ఈలోక సంబంధుడను కాను" [యోహాను 8 : 23].

3. దయ్యములు :- "ఇంతే కాక దయ్యములు - నీవు దేవుని కుమారుడవని కేకలు వేసి అనేకులను వదలిపోయెను. ఆయన క్రీస్తు అని వాటికి తెలిసియుండెను గనుక ఆయన వాటిని గద్దించి వాటిని మాటాడ నీయలేదు" (లూకా 4 : 41).

4. బాప్తిస్మ మిచ్చు యోహాను :- "మరునాడు యోహాను యేసు తన యొద్దకు రాగా చూచి-ఇదిగో లోక పాపమును మోసికొనుపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" (యోహాను 1 : 29).

5. శిష్యులు :- "వారు మిక్కిలి భయపడి-ఈయన ఎవరో, గాలియు సముద్రమును ఈయనకు లోబడుచున్నవని యొకనితో ఒకడు చెప్పుకొనిరి" (మార్కు 4 : 41).

6. యోహాను :- "నిజమైన వెలుగు ఉండెను. అది లోకములోనికి వచ్చుచు ప్రతి మనుష్యుని వెలిగించుచున్నది" (యోహాను1:9).

"మనము సత్యవంతుడైన వానిని ఎరుగవలెనని దేవుని కుమారుడు వచ్చి మనకు వివేకమనుగ్రహించి యున్నాడని యెరుగుదుము. మనము దేవుని కుమారుడైన యేసు క్రీస్తు నందున్నవారమై సత్యవంతుని యందున్నాము. ఆయనే నిజమైన దేవుడును నిత్యజీవమునై యున్నాడు" ( I యోహాను 5 : 20).

7. యూదులు :- కాబట్టి నేను పరలోకమునుండి దిగి వచ్చిన ఆహార మని ఆయన చెప్పినందున యూదులు ఆయనను గూర్చి సణుగు కొనుచు-ఈయన యోసేపు కుమారుడైన యేసు కాడా?

ఈయన తలిదండ్రులను మన మెరుగుదుము గదా? నేను పరలోకము నుండి దిగి వచ్చియున్నానని ఈయన ఏలాగు చెప్పుచున్నాడనిరి" (యోహాను 6 : 41-42).

"ఇతడు మరియ కుమారుడు కాడా? ఇతడు యాకోబు, యోసే, యూదా, సీమోను అనువారి సహోదరుడగు వడ్లవాడు కాడా? ఇతని అక్క-చెల్లెండ్రందరు మనతో నున్నారు కారా? అని చెప్పుకొనుచు ఆయన విషయమై అభ్యంతరపడిరి" (మార్కు 6 : 3).

8. పరిసయ్యులు :- "క్రీస్తుని గూర్చి మీకేమి తోచుచున్నది? ఆయన ఎవరి కుమారుడని అడిగెను. వారు-ఆయన దావీదు కుమారుడని చెప్పిరి" (మత్తయి 22 : 42).

9. జన సమూహములు :- "జన సమూహము-ఈయన గలిలయలోని నజరేతు వాడగు ప్రవక్తయైన యేసు అని చెప్పిరి" (మత్తయి 21 : 11).

10. నతనియేలు :- "నతనియేలు - బోధకుడా, నీవు దేవుని కుమారుడవు, ఇశ్రాయేలు రాజవు అని ఆయనకు ఉత్తర మిచ్చెను" (యోహాను 1 : 49).

11. నికొదేము :- యూదుల అధికారియైన నీకొదేమను పరిసయ్యుడొక డుండెను. అతడు రాత్రియందు ఆయన యొద్దకు వచ్చి—బోధకుడా, నీవు దేవుని యొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము, దేవుడతనికి తోడై యుండ టనే గాని నీవు చేయుచున్న సూచక క్రియలను ఎవడును చేయలేడని ఆయనతో చెప్పెను" (యోహాను 3 : 1-2).

12. మార్త :- "ఆమె - అవును ప్రభువా, నీవు లోకమునకు రానలసిన దేవుని కుమారుడవైన క్రీస్తువని నమ్ముచున్నా నని ఆయనతో చెప్పెను" (యోహాను 11 : 27).

13. సమరయస్త్రీ :- ఆ సమరయ స్త్రీ - యూదుడవైన నీవు సమరయస్త్రీనైన నన్ను దాహమునకిమ్మని యేలాగు అడుగుచున్నావని ఆయనతో చెప్పెను. ఏలయనగా యూదులు సమరయులతో సాంగత్యము చేయరు (యోహాను 4 : 9).

"అప్పుడా స్త్రీ - అయ్యా నీవు ప్రవక్తవని గ్రహించుచున్నాను. మా పితరులు ఈ పర్వతమందు ఆరాధించిరి గాని ఆరాధింపవలసిన స్థలము యెరూషలేములో ఉన్నదని మీరు చెప్పుదురని ఆయనతో అనెను (యోహాను 4 : 19-20).

14. ఒక అధికారి :- "ఒక అధికారి ఆయనను చూచి - సద్బోధకుడా, నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయవలెనని ఆయననడిగెను" (లూకా 18 : 18).

15. పిలాతు :- "పిలాతు మరల వెలుపలికి వచ్చి - ఇదిగో ఈయన యందు ఏదోషమును నాకు కనబడలేదని మీకు తెలియునట్లు ఈయనను మీ యొద్దకు వెలుపలికి తీసుకొని వచ్చుచున్నానని వారితో అనెను" (యోహాను 19 : 4).

16. పిలాతు భార్య:- "అతడు న్యాయపీఠముమీద కూర్చుండి యున్నప్పుడు అతని భార్య - నీవు ఆ నీతిమంతుని జోలికి పోవద్దు, ఈ పొద్దు ఆయననుగూర్చి నేను కలలో మిక్కిలి బాధపడితినని అతని యొద్దకు వర్తమానము పంపెను" (మత్తయి 27 : 19).

17. యూదా:- "నేను నిరపరాధ రక్తమును అప్పగించి పాపము చేసితినని చెప్పెను" (మత్తయి 27 : 4).

18. నేరస్థుడు :- "మనకైతే యిది న్యాయమే మనము చేసిన వాటికి తగిన ఫలము పొందుచున్నాము గాని యీయన ఏతప్పిదమును చేయలేదని చెప్పెను" (లూకా 23 : 41).

19. శతాధిపతి :- "శతాధిపతి జరిగినది చూచి - ఈ మను ష్యుడు నిజముగా నీతిమంతుడై యుండెనని చెప్పి దేవుని మహిమ పరచెను" (లూకా 23 : 47).

20. తోమా :- అందుకు తోమా ఆయనతో - నా ప్రభువా, నా దేవా అనెను" (యోహాను 20 : 28).

21. క్లెయొపా :- "వారిలో క్లెయొపా అనువాడు యెరూష లేములో బసచేయుచుండి, యీ దినములలో అక్కడ జరిగిన సంగ తులు నీ వొక్కడవే యెరుగవా ? అని ఆయనను అడిగెను. ఆయన- అవి ఏవని వారిని అడిగినప్పుడు వారు-నజరేయుడైన యేసును గూర్చిన సంగతులే, ఆయన దేవుని యెదుటను ప్రజలందరి యెదుటను క్రియ లోను వాక్యములోను శక్తిగల ప్రవక్తయైయుండెను" (లూకా 24 : 18-19).

22. పేతురు :- "అందుకు సీమోను పేతురు-నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను" (మత్తయి 16 : 16).

"సీమోను పేతురు-ప్రభువా, యెవని యొద్దకు వెళ్ళుదుము ? నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు నీవే దేవుని పరిశుద్ధుడవని మేము విశ్వసించి యెరిగి యున్నామని ఆయనతో చెప్పెను" (యోహాను 6 : 68-69).

23. పౌలు :- "వెంటనే సమాజ మందిరములలో-యేసే దేవుని కుమారుడని ఆయనను గూర్చి ప్రకటించుచు వచ్చెను" (అపో.కా.9:20)

"నిరాక్షేపముగా దైవ భక్తిని గూర్చిన మర్మము గొప్పదై యున్నది".

ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను.
ఆత్మ విషయమున నీతి పరుడని తీర్పునొందెను.
దేవ దూతలకు కనబడెను.

రక్షకుడని జనములలో ప్రకటింపబడెను.
లోకమందు నమ్మబడెను.
ఆరోహణుడై తేజోమయుడయ్యెను (I తిమోతి 3 : 16).

"పితరులు వీరి వారు; శరీరమునుబట్టి క్రీస్తు వీరిలో పుట్టెను. ఈయన సర్వాధికారియైన దేవుడై యుండి నిరంతరము స్తోత్రార్హుడై యున్నాడు ఆమేన్" (రోమా 9 : 5).

24. ప్రతి ఒక్కరికి :- "రాజులకు రాజును ప్రభువులకు ప్రభువును అనునామము ఆయన వస్త్రము మీదను తొడ మీదను వ్రాయబడియున్నది" (ప్రకటన 19 : 16).

ప్రియ చదువరీ ! క్రీస్తును గూర్చి నీ యభిప్రాయ మేమిటి ? క్రీస్తు ఎవరని తలస్తున్నావు ?

"ఆమె యొక కుమారుని కనును. తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను. "యేసు" అను పదమునకు 'రక్షకుడు' అని అర్థము" (మత్తయి 1 : 21). ఆయనను నమ్మి బాప్తిస్మము పొంది రక్షింపబడుము.

— ఇసుకపట్ల ఇజ్రాయెల్, కాకినాడ.

---

## జక్కయ్య నుండి ఒక పాఠం

బైబిలునందు బహుగా ప్రాచుర్యము నొందిన వారిలో జక్కయ్యను కూడా మనం చూడగలం. యేసు సంచరించుచు యెరికో పట్టణము గుండా జన సమూహములలోనుండి యెరూషలేమునకు చివరి సారిగా సాగిపోతున్నప్పుడు సుంకపు గుత్తదారుడును ధనవంతుడునైన జక్కయ్యను యేసు చూచెను. యేసు ఎవరోయని మనసునందు కోరిక గల్గి ఆయనను చూడగోరెను కాని అతడు పొట్టివాడైనందున

జనులు గుమిగూడి యున్నందున చూడలేక పోయెను. అప్పుడు యేసు ఆ త్రోవను రానై యుండెనని తెలిసి అతడు ముందుగా పరిగెత్తి, ఆయనను చూచుటకు ఒక మేడిచెట్టెక్కెను. "యేసు ఆ చోటుకి వచ్చి నప్పుడు, కన్నులెత్తి చూచి - జక్కయ్యా త్వరగా దిగుము, నేడు నేను నీ యింట నుండవలసి యున్నదని అతనితో చెప్పగా, అతడు త్వరగా దిగి సంతోషముతో ఆయనను చేర్చుకొనెను. అందరూ అది చూచి - ఈయన పాపియైన మనుష్యునియొద్ద బసచేయ వెళ్ళెనని చాలా సణుగుకొనిరి. జక్కయ్య నిలువబడి - ఇదిగో ప్రభువా, నా ఆస్థిలో సగము బీదలకిచ్చుచున్నాను; నేనెవని యొద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసుకొనినయెడల అతనికి నాలుగంతలు మరల చెల్లింతునని ప్రభువుతో చెప్పెను. అందుకు యేసు - ఇతడునూ అబ్రాహాము కుమారుడే: ఎందుకనగా నేడు ఈ యింటికి రక్షణ వచ్చియున్నది. నశించినదానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని అతనితో చెప్పెను" (లూకా 19:5-10).

## రక్షణ అందరికీ

ఇక్కడ, యేసును చూడగోరి జక్కయ్య ఏవిధంగా వెదికెనో భక్తుడైన లూకా వివరించెను. అదే విధంగా యేసు కూడా జక్కయ్యను చూడగోరి వెదికెనా? అవును "ఎందుకనగా నశించినదానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెను" (లూకా 19:10). జక్కయ్య నశించినవాడై యుండెను. యేసుకూడా అతనిని వెదకెను. యెరికో పట్టణమందు జక్కయ్య తప్ప మరి యెవరునూ రక్షణ నొందుటకు గాను నశించినవారు లేరా? లేఖనములు ఈ విధంగా చెప్పుచున్నవి: "ఇది మంచిదియు మన రక్షకుడగు దేవుని దృష్టికి అనుకూలమైనదియునై యున్నది. ఆయన మనుష్యులందరూ రక్షణపొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు" (1 తిమోతి 2:3-4).

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. ఏలయనగా ఆయన తన అద్వితీయ కుమారుని లోక రక్షణార్థమై శిలువ మరణము నొందు నంతగా ప్రేమించెను. యేసు ఈలాగు పలికెను: "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతిని కలుగజేతును" (మత్తయి 11:28). మరియు "తన యెడల యథార్థ హృదయముగల వారిని బలపరచుటకై యెహోవా కనుదృష్టి లోకమందంతట సంచారము చేయుచున్నది" (2 దినవృ 16:9).

## రక్షింపబడేవారు కొందరే

అందరూ పిలువబడినవారే కాని కొందరు మాత్రం ఏర్పరచు కొనబడినవారు. వారిలో జక్కయ ఒకడు. ఎందుకనగా అతను దేవుని గూర్చి వినినప్పుడు ఆయనను చూడగోరి వెదకెను. "దేవునియొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును" (యాకోబు 4 : 8). యేసుద్వారా స్వస్థతనొందిన రోజులలో అనేకులు మొదట ఆయన యొద్దకు వచ్చిరి. అప్పుడాయన వారితో "మీ విశ్వాసమె మిమ్ము లను శుద్ధులను చేసెను" అని చెప్పెను. మరియు "ఇదిగో నేను తలుపు నొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల, నేను అతనియొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడా అతడును భోజనము చేయుదుము" (ప్రకటన 3:20). సమస్త జనులను ఆయన ప్రేమించి రక్షింపనుద్దేశించి వెదకుచూ ప్రతి హృద యము నొద్దకు నిలుచుండి పిలుచుచు తట్టుచున్నాడు. ఆయన స్వరము గుర్తించి తలుపు తెరచిన ఆయన వానితో కలసి భోజనము చేయును.

## వెదకాలి

తరువాత, జక్కయ్య పొట్టివాడు. ఈ లేమి వలన జనసమూ హములో నుండి యేసును చూడలేకపోయెను. అయినను నిరాశ

చెంపక యేసును గాంచవలెనన్న యిచ్ఛతో పరుగెత్తి మేడిచెట్టెక్కెను.

యేసుద్వారా గ్రుడ్డివాడు స్వస్థతనొంది చూపు పొందుటకు ముందు "ఒక ధనికుడైన అధికారి పరిగెత్తుకొని వచ్చి ఆయన యెదుట మోకాళ్ళూని - సద్బోధకుడా, నిత్యజీవమునకు వారసుడ నగుటకు నేనేమి చేయుదునని ఆయనను అడిగెను" (మార్కు 10:17). అందుకు యేసు ఆజ్ఞలకు లోబడి యుండవలెనని నీకు తెలియును కదా! అని అతనితో చెప్పెను. అందుకతడు - బోధకుడా, బాల్యమునుండి ఇవి అన్నియు అనుసరించుచునే యుంటినని చెప్పెను. యేసు అతని చూచి అతని ప్రేమించి - నీకు ఒకటి కొదువగా నున్నది; నీవు వెళ్ళి నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము. పరలోకమందు నీకు ధనము కలుగును, నీవు వచ్చి నన్ను వెంబడింపుమని చెప్పెను. అతడు మిగుల ఆస్తిగలవాడు గనుక ఆ మాటకు ముఖము చిన్నబుచ్చుకొని, దుఃఖపడుచు వెళ్ళిపోయెను" (మార్కు 10:20-22). ఈ ధనవంతుడైన అధికారి నిత్యజీవమునకు వారసుడగుటకు తృష్ణగొని యుండెను గాని తనకు కొదువయై యున్నది యేసుద్వారా గ్రహించినవాడైనను దానిని విడువలేక విచారముగా తనదారిని తాను వెళ్లిపోయెను.

## జయించాలి

ఎవరునూ సత్ప్రవర్తన కల్గియుండలేరు. ప్రతివానికి వాని వాని సమస్యలు కలవు, ఇవి మనిషి మనిషికి వేరువేరుగా నున్నవి. ఇహ సంబంధ జీవితమునకు నీతి విషయంలో విశ్వాసము కల్గిన క్రైస్తవ జీవితమునకు మధ్య ఎల్లప్పుడునూ ఆటంకములున్నవి. వానినుండి విముక్తులమై మనకాడి మనమెత్తుకొని ఆయనను వెంబడించుటను యేసు కోరుచున్నాడు. "నేను జయించి నా తండ్రి సింహాసనమునందు కూర్చుండియున్న ప్రకారము జయించువానిని నాతోకూడా నా సింహాసనమునందు కూర్చుండనిచ్చెదను" (ప్రకటన 3:21).

యేసు మన జీవితంలో ప్రవేశించిననాడు, జక్కయ్య జీవితంలో కల్గిన మార్పు వంటిది మన జీవితంలోను కల్గును. "ఇదిగో ప్రభువా, నా ఆస్థిలో సగము బీదలకిచ్చుచున్నాను; నేనెవనియొద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసుకొనిన యెడల అతనికి నాలుగంతలు మరల చెల్లింతునని ప్రభువుతో చెప్పెను" (లూకా 19:8).

యేసు మనలను ఆయన యొద్దకు చేర్చుకొనుటకై వెదుకుచూ పిలుచుచున్నాడు. మనము మన ఆటంకము లన్నిటిని జయించి ఆయనను వెదకిన యెడల నిత్యజీవమునకు వారసులు కాగలము.

—కవిత గూటం, కాకినాడ.

---

## క్రీస్తు సంఘము, కాకినాడ

# విజ్ఞాపన కొరకు వి జ్ఞ ప్తి

సత్యవాక్కు పత్రిక ద్వారా గత పది సంవత్సరాలనుండి ప్రతి మాసము విడువక మీ గృహాన్ని దర్శించుచున్నాము. మరియు సత్యవాణి రేడియో కార్యక్రమం ద్వారా గత 14 సంవత్సరాలుగా ఇంచుమించు ప్రతిరోజు కొన్ని లక్షల గృహాలలో సువార్త అందించు చున్నాము. మేము ప్రచురించిన వివిధములైన ఆధ్యాత్మిక పుస్తకముల వలన అనేక వేలమంది ఆత్మీయంగా మేల్కొల్పబడ్డారనుటలో సందేహం లేదు. మాస పత్రికను చందా లేకుండగనే కొన్ని వేల మందికి పంపుచున్నాము. అట్లే పుస్తకాలు కరపత్రాలు వగయిరా కూడ అతి స్వల్ప ఖర్చుతో మీకందించగలుగు చున్నాము.

వీటన్నిటితో బాటు బైబిలు కరస్పాండెన్సు కోర్సు పనికూడ నిర్విరామంగా జరిగించబడుచున్నది. బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో ఇప్పటికి ఇంచుమించు 5 లక్షలమంది చేరియున్నారు. ఉత్తర ప్రత్యుత్తరాలద్వారా బైబిలు నేర్చుకొనుచున్నారు.

పైన చెప్పబడిన ఈ పని అంతయు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లోని ఒక చిన్న గదిలో నుండియు, జాషువా గూటంగారి గృహమునుండియు జరిగించబడుచుండేది. అయితే దేవుని కృప వలన గత సంవత్సరం కాకినాడలో ఈ పని నిమిత్తము ఒక స్థలం కొనగలిగాము. ఆ స్థలంలోయున్న పాత బిల్డింగ్‌ను పడగొట్టి ఒక క్రొత్త బిల్డింగును కట్టుటకు సంకల్పించియున్నాము. ఈ క్రొత్త బిల్డింగ్‌లో సత్యవాణి, సత్యవాక్కు, కరస్పాండెన్సు కోర్సుల ఆఫీసులు మాత్రమే గాక స్థానిక సంఘ కూడికలకు ఒక ఆడిటోరియమ్ కూడ యుండును. లెక్చర్‌షిప్‌లకు, సెమినార్‌లకు ఉపయోగింపబడే ఒక పెద్ద ఆడిటోరియమ్ పై అంతస్థులో యుండును. మరియు కాకినాడకు వచ్చే బోధకులకు వసతి కల్పించబడును.

స్థలాన్ని సేకరించుటలో బెయిలీగారు ఆర్థికంగా చాల సహాయపడ్డారు. గనుక బిల్డింగ్‌ను నిర్మించుటలో భారతీయ సహోదరులు సహాయపడాలని కోరుచున్నాము. కాకినాడ నుండి మేము జరిగించుచున్న పనిద్వారా ఇంచుమించు తెలుగువారంతా ఆశీర్వదించబడుచున్నారు. గత రెండు దశాబ్దాలకు పైగా మేము చేయుచున్న పని ద్వారా మీరు సంతృప్తి చెందిన యెడల ఈ నూతన భవనమును నిర్మించుటలో మాకు చేయూత నీయండి. దేవుని నామ ఘనత కొరకు, క్రీస్తు రాజ్య విస్తరణ కొరకు సంకల్పించిన ఈ భవన నిర్మాణము నిమిత్తమై మీ విరాళములు పంపించండి. సహో. బెయిలీగారు మన దేశంలో జరిగించిన సత్య సువార్త సేవకు జ్ఞాపకార్థముగా కూడ యిది నిర్మించబడుచున్నది.

మీరు విరాళము పంపునపుడు అది భవన నిర్మాణ నిమిత్తము అని తప్పక తెలియజేయండి. వంద రూపాయలుగాని, దానికి అదనంగాగాని పంపిన వారి పేర్లు జాబితా సత్యవాక్కులో ఎప్పటికప్పుడు

ప్రచురింపబడును. మీరివ్వదలుచుకొన్న కానుక స్వల్పమైనా, అధిక మైనా ఘనంగా ఎంచబడును. మీ విరాళములను దిగువ చిరునామాకు పంపించండి. డ్రాఫ్టులు నగయిరా జాషువా గూటంగారి పేరున గాని, సత్యవాణి పేరునగాని పంపించండి. మాతో కలసి ప్రార్థించండి. వందనములు.

అడ్రసు :

SATYA VANI,
Seshagirirao Street
KAKINADA-533 004. (A.P.)
Phone : 73697

---

## కాకినాడ బిల్డింగుకు కానుకలిచ్చినవారు

| | |
|---|---|
| A.G. బెయిలీ, కృష్ణసముద్రం | 38.35 |
| జెస్సీ జేసన్ & ఫామిలీ, కాకినాడ | 5000.00 |
| G.J. ఆనందరావు దంపతులు, రాజమండ్రి | 1000.00 |
| B. జాన్ మోజెస్, తోలేరు | 200.00 |
| శాంతి నగర్ క్రీస్తు సంఘము, విశాఖపట్టణము, D. శ్రీరాములుగారి ద్వారా | 500.00 |
| K. ప్రసాద్, ఆచంట క్రీస్తు సంఘము | 400.00 |
| P. సత్యానందం, భీమనపల్లి క్రీస్తు సంఘం | 300.00 |
| S. జెకర్యా, సిమెట్రీపేట, క్రీస్తు సంఘం, రాజమండ్రి | 500.00 |
| G. మంజుల రాజకుమారి, తిరుపతి | 50.00 |
| ధనరాజు బొంతు, అమలాపురం | 1000.00 |
| శ్రీమతి B. మేరీరత్నం, భోగోలు | 100.00 |
| శ్రీమతి సుహాసిని ప్రేమ్‌రాజ్, హైదరాబాదు | 20.00 |

# క్రీస్తు సంఘము

## (The Church of Christ)

క్రీస్తు సంఘమనేది మతశాఖ కాదు. ఇది మొదటి శతాబ్దములో (క్రీ॥శ 33లో) యెరూషలేములో పెంతెకోస్తు అను పండుగదినాన 3000 మందితో ప్రారంభించబడిన, క్రీస్తు శిరస్సుగా కలిగిన క్రీస్తు శరీరము. "శరీర మొక్కటే" (ఎఫెసీ 4:4). చీకటి యుగము తరువాత దిద్దుబాటు ఉద్యమ ఫలితం కాదిది. పునరుద్ధరించబడి, సత్యమునకు స్తంభమును ఆధారమునై యున్న సంఘమది. దైవోక్తులను దైవోక్తులనుగా బోధించే గురి కలిగిన క్రీస్తు రాజ్యమది. బైబిలు మాట్లాడు చోట మాట్లాడి బైబిలు మౌనంగా ఉన్నచోట మౌనంగా నుండుటయే దాని పని. శిరస్సు యొక్క లేఖనానుసారమైన నామము, పరిపాలన, ఆరాధనాక్రమము కలిగిన విశిష్టమైన స్థానం దానికున్నది. అది ఈ లోక సంబంధమైనది కాదు. ఆత్మీయమైనది.

ఇందలి సభ్యులు లేఖనానుసారమైన నామముతో పిలువబడు చున్నారు. సత్యము, మంచి జీవితము లేదా నమ్మకమైన జీవితము జీవకిరీటం పొందడానికి మార్గాలని లేఖనాలు చెప్పే సత్యాలను ఎరిగిన వారు; వెంబడించుచున్నవారు. సంఘానికి 'పొలము' అనే పర్యాయ పదం ఉన్నది. పొలంలో కలుపు మొక్కలుంటాయి. వాటిని వ్యవ సాయదారుడు నాటడు అయినా మొలుస్తాయి. అందుచేత 'పొలము' మంచిదికాదని, పనికిమాలినదని ఎవరైనా అంటారా? కలుపుమొక్కలు వేరుచేయబడి అగ్ని చేత కాల్చబడతాయి.

సంఘమునకు 'శరీరం' అనే పర్యాయపదం ఉన్నది. శరీరంలో ఒక అవయవానికి గాయమైతే వైద్యం చెయ్యించవలసి యున్నది. అంతేగాని శరీరం మంచిది కాదని అనరుకదా! అపొస్తలులు బ్రతికి యున్న కాలంలోనే క్రీస్తు సంఘంలో సమస్యలున్నాయి. కొరింధు

సంఘములో ఒక పాపియైన మనుష్యుడున్నాడు (1 కొరింథీ 5 : 1). అతనిని వెలివేయమని పౌలు పత్రిక వ్రాసి పంపాడు. అతడు కొరింథులో నున్న క్రీస్తు సంఘ సభ్యుడు. అతని మాలిన్యం సంఘానికి మలినం చేసిందా? అతని తప్పుకు అతడు తప్పక శిక్షింపబడతాడు. "రాజ్య సంబంధులు వెలుపటి చీకటిలోనికి త్రోయబడుదురు" అని వ్రాయ బడిన ఈమాట క్రీస్తు సంఘంలోనుండి మంచి జీవితం జీవించనివారు వెలుపటి చీకటిలోనికి త్రోయబడుదురు అని అర్థం. సత్యమైన సంఘ ములో సభ్యత్వముగలవారే నమ్మకముగా జీవించని పక్షమున శిక్షించబడితే మానవకల్పిత సంఘంలో నుండి మంచి జీవితాన్ని జీవించిన ప్రయోజనముండదు. సత్యము, నమ్మకమైన జీవితము నిత్య జీవితానికి చేరుస్తాయి.

'క్రీస్తు సంఘస్థులు మారుమనస్సు లేనివారు' ఇది తరచు వింటున్న మాట. అన్ని మతశాఖలలోను మారుమనస్సు లేనివారు న్నారు. క్రీస్తు సంఘములో కూడ మారుమనస్సు లేనివారుండ వచ్చును. అందరికీ భక్తిపరులుగాను, ప్రార్థనాపరులుగాను కన్పించాలనే తపన వీరికుండదు. ఎందుచేతనంటే బైబిలు అట్టివారిని ఖండించుచున్నది. గనుక వేషధారణ, ప్రత్యేకమైన వస్త్రధారణ వీరికి లేదు. "దేవుడు అద్భుతరీతిగా ప్రత్యక్షమై నన్ను సేవకు పిలిచాడని" అబద్ధమాడగల ధైర్యం వీరికి లేదు. పరిశుద్ధాత్మను కించపరిచే విధంగా శరీరసంబంధమైన కేకలు, గంతులు వీరికి చేతకావు. యివన్నీ ఉన్న అనేకులు క్రీస్తు సంఘస్థులకు మారుమనస్సు లేదని చెప్పడం విడ్డూరమేమీ కాదు.

పౌలును "ఈ మనుష్యుడు పీడవంటివాడు" (అ.కార్య. 24:5) అని నిందించిన స్వార్థపరులు క్రీస్తు ప్రభువును "తిండిబోతు, మద్య పాని పాపులకు సుంకరులకు స్నేహితుడు" (మత్త 11:19) అని నేరారో పణచేసిన వారివంటి మానవులు క్రీస్తు శరీరాన్ని దూషిస్తారు.

వారు దూషించినంత మాత్రాన దానియొక్క పరిశుద్ధతలో ఏలోపము రాదు.

"క్రీస్తు సంఘము మిగిలిన మతశాఖలకంటె బైబిలు ప్రకారమైన సంఘమని" టైమ్ పత్రిక వ్రాసింది. ఇది క్రైస్తవ పత్రిక కాదు. మానవులకు అత్యంత వినోదకరమైన యాంత్రిక సంగీతాన్ని ఇది ఆరాధనకు దూరంగా ఉంచింది. వినోదం కంటె దేవుని చిత్తం ముఖ్యమనే గురి వీరు కలిగియున్నారు. యాంత్రిక సంగీతం కావాలని కోరుకొన్న కొందరు వేరే మతశాఖ ఏర్పాటు చేసుకొంటే, యిట్టి విభజన పునరుద్ధరణ ఉద్యమము తరువాత జరిగినప్పుడు వాక్యాన్ని అగౌరవించేవారు విడిపోయినప్పుడు సంఘము మరింత బలపడింది. అంతేగాని క్రీస్తు సంఘము ముక్కలుగా ఎప్పుడు విడిపోలేదు.

పునరుద్ధరణ ఉద్యమం తరువాత క్రీస్తు సంఘస్థులు మతశాఖ బోధకులతోను నాస్తికులతోను అనేక బహిరంగ తర్కములలో (Public Debates) పాల్గొని వారిని జయించి సత్యాన్ని ప్రజలకు చాటి చెప్పారు, చెప్పుచూనే ఉన్నారు.

అవును క్రీస్తు సంఘము మతశాఖ కాదు, క్రీస్తు రక్తముతో కొనబడిన ఆయన సంఘము.

— E. K. V. ప్రసాదరావు, చెయ్యేరు.

---

## ఒకడు బాప్తిస్మము పొందితే

రక్షింపబడును : "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16). "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" (1 పేతురు 3 : 21).

క్షమింపబడును : "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" (అపొ. కా. 2 : 38).

**అతని పాపములు కడుగబడును :** "లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము" (అపొ. కా. 22 : 16).

**క్రీస్తులో ప్రవేశించును :** "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3 : 27).

**నూతనసృష్టి యగును :** "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను" (2 కొరింథీ 5 : 17).

**క్రీస్తుసంఘ సభ్యుడగును :** "మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో (సంఘముతో) చేర్చుచుండెను" (అపొ. కా. 2 : 47).

---

Regd. No. R/KD—45/KD.B.O.

*From*
**SATYAWAKKU**
**P.O. Box. 80**
**KAKINADA-533 001**

No.

To

............................................

............................................

............................................

............................................